**పత్రికాప్రకటన** **కాకినాడ, జూలై 26, 2019.**

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పడాలి.

విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి.

-- విద్యా శాఖ అధికారుల సమావేశంలో కలక్టర్ మురళీధర్ రెడ్డి.

జిల్లాలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి సూచించారు. శుక్రవారంనాడు కాకినాడలోని జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో జిల్లాలోని డిప్యూటీ ఇఓలు, యంఇఓలు మరియు సెక్టోరల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలు గల విద్యను అందించడంలో నిరంతర కృషి జరగాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అందిస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, ఉపాధ్యాయులు విద్యను అందించాలన్నారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు వస్తున్నాయని, పాఠశాలలు డిజిటల్ విద్యావిధానం, వర్చువల్ క్లాస్ రూమ్స్ నిర్వహణ పట్ల శ్రద్ధ చూపాలని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పాఠశాలల్లో వాతావరణం మార్చారని, మౌలిక సదుపాయాల కల్పన కోసం దాతల సహకారాన్ని కూడా తీసుకోవాలని అన్నారు. పాఠశాలల్లో విదార్థులకు విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, బాలికల ఆరోగ్య పరిరక్షణ పట్ల పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ప్రవర్తన సక్రమంగా వుండాలని కలక్టర్ సూచించారు. పాఠశాలల్లో అమలు చేసే మధ్యాహ్న భోజన పథకం పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని, దీని కోసం ప్రత్యేకంగా ఒక యాప్ ను కూడా రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాలో డిజిటల్ క్లాస్ రూమ్ ల వినియోగం పెరగాలని, ఉపాధ్యాయులు ఈ-హాజరు పూర్తి స్థాయిలో వుండాలని కలక్టర్ సూచించారు. జిల్లాలోని పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అవసరతను తెలియజేయాలని కూడా కలక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, సర్వ శిక్షాభియాన్ ప్రోజెక్ట్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉపాధ్యాయులకు డిజిటల్ విద్యా విధానం సామాగ్రిని కలక్టర్ అందజేశారు.

**జి.జి.హెచ్.లో అనాధలకు ఆధార్ –**

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోని డి.వి.యల్.వార్డులో జాయిన్ అయిన అనాధలకు ఆధార్ కార్డు ద్వారా వివిధ సంక్షేమ కార్యక్రమాలు అందజేసే ప్రక్రియకు అధికారులు నాంది పలికారు. ఇటీవల జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి దృష్టికి డి.వి.ఎల్.వార్డులోని అనాధలకు ఆధార్ కార్డు లేని మూలంగా వారికి వైద్య సౌకర్యం అందించడంలో ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఈ మేరకు ఈ వార్డులోని అనాధలకు ఆధార్ కార్డు సౌకర్యం కల్పించాలని కలక్టర్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారంనాడు జేసి-2 జి.రాజకుమారి ఆధ్వర్యంలో 11 మంది అనాధలకు ఆధార్ కార్డు అందించడం కోసం చర్యలు చేపట్టారు. ఈ అనాధలకు అవసరమైన వేలి ముద్రలు, ఇతర ఆధారములు సేకరించారు. ఈ సందర్భంగా జేసి-2 జి.రాజకుమారి మాట్లాడుతూ ఈ ఆధార్ కార్డు ఆధారంగా వీరిని అనాధ ఆశ్రమంలో చేర్చడానికి , జిజిహెచ్ లో వైద్య సదుపాయాలు పొందడానికి వీలౌతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.యం.రాఘవేంద్రరావు, ఆర్.యం.ఓ. డా.గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )